విలీన బడులు.. విద్యార్థుల అగచాట్లు

- 3,4,5 తరగతి విద్యార్థులకు అందని యూనిఫాం, స్కూల్‌బ్యాగ్, మా
- కొందరికే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ
- మధ్యాహ్న భోజన సరుకుల కోటా కూడా అరకొరగానే..
- విద్యాశాఖ తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు




ఎస్ఎస్ఎస్ హైస్కూల్ కాంపౌండ్‌లోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మట్టిలో కూర్చున్న విద్యార్థులు, యూనిఫామ్ లేక కలర్ డ్రస్సుల్లో హాజరైన విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో విద్యా వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గతంలో ఉన్నత పాఠశాలల్లో విలీనమైన సమీప పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఏడాది క్రితం అధికారంలోని వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ పూర్వపు ప్రాథమిక పాఠశాలల్లోకే విలీనం చేసింది. అయితే ఆ తరగతుల విద్యార్థులకు కావాల్సిన వసతులు, కిట్లు, పుస్తకాలు సమకూర్చలేకపోయింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది.

గతంలో ఉన్న రోల్ ప్రకారమే కిట్ల పంపిణీ

ప్రాథమిక పాఠశాలల్లో గతంలో వున్న 1,2 వ తరగతి విద్యార్థులకు రోల్ ప్రకారం ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలోని యూనిఫాం, స్కూల్‌బ్యాగ్‌లు, బూట్లు తదితర వాటిని కేటాయించింది. కానీ పునఃవిలీనమైన 3, 4, 5 తరగతుల విద్యార్థులకు దాదాపు 25 శాతం మందికి కిట్లను ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు విద్యాశాఖ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎమ్మిగనూరు మండల పరిధిలో, పట్టణంలోని కొన్ని పాఠశాలలున్నాయి. వాటిలో ఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వున్న తెలుగు మెయిన్ ప్రాథమిక పాఠశాలతో పాటు కోటేకల్ ,దైవందిన్నె, ప్రభుత్వ బాలుర పాఠశాల, పార్లపల్లె, కె.తిమ్మాపురం, టిఎస్ కూలూరు ప్రాథమిక పాఠశాలలున్నాయి. అదేవిధంగా గోనెగండ్ల మండలంలో 7 ప్రాథమిక పాఠశాలున్నాయి. ఆయా పాఠశాలల్లో 5శాతం పిల్లలకు కిట్ల పంపిణీ కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. తమ పిల్లలకు ఇవ్వాల్సిన విద్యార్థి మిత్ర కిట్లపై ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే వస్తే ఇస్తామనే సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు.

మధ్యాహ్న భోజనానికీ ఇబ్బందులే..

మధ్యాహ్న భోజనానికైతే విలీన బడుల్లో 1 నుంచి 5 తరగతుల్లో వుండే విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు బియ్యం కోటా జూన్ నెలతో పాటు జూలై నెలలో సక్రమంగా సరఫరా చేయలేదు. దీంతో హైస్కూళ్లలో ప్రాథమిక పాఠశాల వంట ఏజెన్సీలు బయటి నుంచి కొని తెచ్చుకున్నాయి. ఇలా విలీన బడుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాల్సిన ఉన్నత విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

గదుల్లేక నేలపైనే చదువులు

పట్టణంలోని ఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్ కాంపౌండ్‌లో వున్న తెలుగు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో నాడు -నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. దీంతో తరగతిని అసంపూర్తి గదుల్లో మట్టిపైనే కూర్చొబెట్టి ఉపాధ్యాయులు తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థి మిత్ర కిట్ ఇవ్వలేదు



నాకు విద్యార్థి మిత్ర కిట్ ఇవ్వలేదు. దీంతో బ్యాగ్, యూనిఫాం లేక పోవడంతో పాతవాటితోనే స్కూల్‌కు వస్తున్నా. అందరికి ఇచ్చినట్లు మాకు కూడా ఇవ్వాలి. గదుల్లేవు మాకు డెస్కులు లేవు. నేలమీదనే కూర్చుంటున్నాం.
– రషీద్,తెలుగు మెయిన్ ప్రాథమిక పాఠశాల, ఎమ్మిగనూరు

విద్యార్థులందరికీ కిట్లు పంపిణీ చేశాం



విలీన పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఎస్ఆర్‌కేవీఎం కిట్లను పంపిణీ చేశాం. ఇంకా అవసరమైతే ప్రతిపాదనలు పంపి తెప్పించి పంపిణీ చేస్తాం. మధ్యాహ్న భోజనానికి ఏ పాఠశాలలో కూడా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – మధుసూదన్ రాజు, ఎంఈఓ 2, ఎమ్మిగనూరు

విలీన పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



కూటమి ప్రభుత్వం హైస్కూళ్ల నుంచి పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతుల విద్యార్థులకు అన్నీ సమకూర్చాలి. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఆయా పాఠశాలల్లో విద్యార్థులందరికీ సత్వరం పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలి. కొందరికి ఇచ్చి మరికొందరికి నేటికి పంపిణీ చేయక పోవడం దారుణం. పాఠశాలలు పునః ప్రారంభమై 50 రోజులు గడిచినా నేటికీ కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజన బియ్యం పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం.
– బలరామ్‌యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

బియ్యం సరఫరాలో పొరపాట్లకు తావివ్వొద్దు



ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: రేషన్ బియ్యం సరఫరాలో పొరపాట్లకు చోటు ఇవ్వరాదని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం స్థానిక పౌర సరఫరాల గోదామును ఆయన ఆకస్మిత తనిఖీ చేశారు. బియ్యం, ఇతర సరుకుల స్టాక్, రికార్డులు, బియ్యం బస్తాల తూకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లకు బియ్యం సరఫరా చేసేటప్పుడు తూకాల్లో తేడాలు రాకూడదన్నారు. నిల్వ లెక్కలు పక్కాగా ఉండాలని, పౌర సరఫరాల విభాగం అధికారుల పర్యవేక్షణ క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. అనంతరం బియ్యం, జొన్నల బస్తాలను తూకాలను తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహశీల్దార్ వీరభద్రగౌడ్, సీఎస్‌డీటీ చంద్రకళ, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు

ఆదోని టౌన్: బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోనిలోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దాదాపు 18 నెలలు కావొస్తున్నా ఇంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని చెప్పి అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏర్పాటు చేశారన్నారు. ఏపీలో మాత్రం అధికశాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో డివిజన్ ఉపాధ్యక్షులు ధనాపురం శేషన్న, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, డివిజన్ గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, ఆదోని పట్టణ అధ్యక్షుడు డాక్టర్ వీరేష్, తాలూకా గౌరవ సలహాదారులు కపటి వీరభద్ర, రాముడు, జాయింట్ సెక్రటరీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని పారదోలుదాం



ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయవ్యాధిని దేశం నుంచి పారదోలుదామని, క్షయవ్యాధి నిర్మూలనకై ప్రతిఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 21వ వార్డు మహాత్మాగాంధీనగర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు తదితర లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, మేరీ అరుణ, సుబ్బమ్మబాయి, ఏఎన్ఎం శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- 58 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందజేసిన మాజీ ఎమ్మెల్యే

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలో ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి బుధవారం నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని కపటి గ్రామంలో మోహన్‌రెడ్డి ట్రేడర్స్ ఫామ్ హౌస్ ఎదురుగా ఇస్కాన్ టెంపుల్ నిర్మించడానికి మాజీ ఎమ్మెల్యే 58 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందించారు. అలాగే మోహన్‌రెడ్డి, ఇతర దాతలు కలిసి 120 సెంట్లు ఇవ్వగా మొత్తం 178 సెంట్లను దేవాలయ నిర్మాణానికి ఇస్కాన్ సంస్థకు అప్పగించారు. ఆలయ నిర్మాణంలో పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు అందరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, ఇస్కాన్ కిరణ్, చంద్రశేఖర్, సురేష్, విశ్వహిందూ పరిషత్ నాయకులు బసవన్నగౌడ్, ప్రతాప్‌స్వామి, విరూపాక్షిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, ఆశోక్‌నందారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ భార్గవి

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మద్రవాడ భార్గవి అన్నారు. బుధవారం సబ్ డివిజన్ పోలీస్ అధికారిణిగా మద్రవాడ భార్గవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ ఉపేంద్రబాబు కర్నూలు దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. డీఎస్పీ ఎం.భార్గవి మాట్లాడుతూ తన మొదటి పోస్టింగ్ ఇక్కడేనని చెప్పారు. తన సొంతూరు వెస్ట్‌గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు. ఎవరికైనా సమస్య ఉంటే భయపడకుండా నేరుగా వచ్చి తనను కలవచ్చునని, ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం డీఎస్పీని డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం డీఎస్పీ జిల్లా ఎస్పీ, డీఐజీని కలిసేందుకు కర్నూలు వెళ్లారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును మానుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూటమి ప్రభుత్వం మానుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవ సహాయం, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ స్మార్ట్‌మీటర్లు పెడితే వాటిని పగులగొట్టండి అని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నాటి మాటను నిలబెట్టుకోలేకపోతుందన్నారు.

సంక్షిప్తం

రోడ్లను బాగు చేయండి

ఆదోని రూరల్: పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు నుంచి సిరుగుప్ప చెక్‌పోస్టు వరకు గుంతలు పడిన ఆర్అండ్‌బీ రోడ్డును బాగు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం బృందం గుంతలు పడిన రహదారిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్రాంతిలోగా రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలని చెప్పారని, ప్రస్తుతం శ్రావణమాసం, దసరా పండగలు రాబోతున్నాయని, రోడ్లు మాత్రం బాగు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ, మండల కార్యదర్శివర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న, వీరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బడి బస్సు ఏర్పాటు చేయండి

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్, మంత్రాలయం మండలంలోని బాపురం గ్రామాలకు విద్యార్థుల సౌకర్యార్థం బడి బస్సును ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు ఖాజా, నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ కంట్రోలర్ ఎల్లప్పకు వినతి పత్రం సమర్పించారు.

సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలి

కోసిగి: పాఠశాలల వేళకు విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ గ్రామాల విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోసిగి: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు మిన్నప్ప, యూనీష్ బాషా, సీఐటీయూ మండల ఉపాధ్యక్షులు వీరేష్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆగస్టు 7వ తేదీన విజయవాడలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ధర్నాకు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగులు గోపాల్, మద్రిస్వామి, కత్తులయ్య, పోతప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఆగస్టు 7వ తేదీన నిర్వహించే చలో విజయవాడ పోస్టర్లను ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్‌చౌదరి స్థానిక విద్యుత్ 132 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రవీణ్‌కుమార్, జావిద్, యునస్‌బాషా, పోతప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

14న మున్సిపల్ షాపుల వేలాలు

ఆదోనిటౌన్: మున్సిపాలిటీ షాపులకు ఆగస్టు 14న బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.కృష్ణ బుధవారం తెలిపారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్, సంతపేట ప్రాంతాల్లోని 13 మున్సిపల్ షాపులకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించి సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

గోనెగండ్ల : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీపీఐ సీనియర్ నాయకుడు మద్దిలేటి నాయుడు, మండల ప్రధాన, సహాయ కార్యదర్శులు శ్రీరాములు, మద్దిలేటి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బొగ్గు మద్దిలేటి, కాడప్ప, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

గోనెగండ్ల : సీజనల్ వాధ్యులు మలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్ఈఓలు హనుమంతు, కృష్ణుడు అన్నారు. మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో డెంగీ అనుమానిత వ్యాధి గ్రాస్తురాలి ఇంటికి వైద్య సిబ్బంది బుధవారం వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటి పరిసరాలలోజిజ శుభ్రంగా ఉంచుకోవాలని వివరించి మురుగు కాలువలలో అబేట్ మందును చల్లించారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఖమీలా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరుకున్న బాలికలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషన్ సొసైటీ నుంచి మంగళవారం రాత్రి అక్కాచెల్లెళ్లు మాదిగ కరుణాక్షి(10), మాదిగ స్వప్న(7) ఎవరికి చెప్పకుండా బంధువుల ఇంటికి వెళ్లిపోయారు. దీంతో సొసైటీ నిర్వాహకులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు అన్ని పోలీస్‌స్టేషన్లకు బాలికల ఫొటోలను పంపించారు, ఆర్టీసీ బస్టాండుల వద్ద గాలించారు. అయితే ఇద్దరు బాలికలు ఆదోని మండలం నాగనాథహల్లిలో తమ బంధువుల ఇంటికి వెళ్లినట్లు గుర్తించి ఎమ్మిగనూరుకు రప్పించారు. మంత్రాలయం మండల రచ్చుమర్రి గ్రామంలోని బాలికల తల్లిదండ్రులు ఎం. దానమ్మ, ఎం.ఈరమ్మలను పిలిపించి వారికి అప్పగించారు. టౌన్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ సొసైటీలో చదువుకోవటం ఇష్టం లేకనే బంధువుల ఇంటికి వెళ్లినట్లు బాలికలు చెపుతున్నారన్నారు. పిల్లలను బలవంతం పెట్టి చదివించవద్దని, వారి ఇష్టాలను తెలుసుకొని చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. సకాలంలో స్పందించి బాలికల ఆచూకీ కనుగొన్నందుకు పట్టణ పోలీసులకు సొసైటీ నిర్వాహకులు సింగనేటి నరసన్న, ప్రతిభ భారతి కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి

నందవరం : మండల పరిధిలోని పూలచింత గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు పెద్దయ్య, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం రెవెన్యూ కార్యాలయంలో పీ–4 సర్వే కార్యక్రమానికి వచ్చిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు ఎంఆర్‌పీఎస్, పీఎస్‌యూ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 18 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 16ఏలో రెండు ఎకరాలు కేటాయించారని, అక్కడే మరింత స్థలం శ్మశాన వాటికాకు కేటాయించాలని కోరారు. సమస్యపై సబ్ కలెక్టర్ స్పందించి 17 రోజులోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని మండల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు నరసింహులు, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీగా పంట నమోదు



చింతకుంటలో పంట నమోదును చేయిస్తున్న ఏఓ వర ప్రసాద్

కోసిగి: పంట నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ క్రాప్ పేరుతో పకడ్బందీగా చేయిస్తున్నట్లు ఏఓ వరప్రసాద్ తెలిపారు. బుధవారం కోసిగి మండలంలోని పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంట రుణం, ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారం పొందేందుకు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఉల్లి, కందులు, జొన్నలు, మిరప, సజ్జలు, కొర్ర సాగుచేసిన రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు.

భూ సమస్యలుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న తహసీల్దారు గీతాప్రియదర్శిని

పెద్దకడబూరు : గ్రామంలో భూ సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తహసీల్దారు గీతాప్రియదర్శిని సూచించారు. మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో రీ సర్వే పూర్తి కావడంతో బుధవారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వేలో రైతులు తమతో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లలితకుమారి, వీఆర్‌ఓ ఆదెప్ప, విలేజ్ సర్వేయర్ రామాంజినేయులు పాల్గొన్నారు.

కర్ణాటక గ్యాస్ సిలిండర్లు సీజ్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోకి కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప తాలూకా ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ గ్యాస్ సిలిండర్ల లోడుతో వచ్చాడు. ప్రజలకు గ్యాస్ సిలిండర్లను అందిస్తుండగా ఆదోని సివిల్ సప్లై అధికారి రుద్రగౌడ్, వీఆర్వో బసవరాజు, రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని విచారించారు. సిలిండర్ల లోడును సీజ్ చేశారు. దాడుల్లో ఇన్సీ హెడ్‌కానిస్టేబుల్ నాయక్, షరీఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లను అమ్ముకుంటున్నారు

ఎమ్మిగనూరుటౌన్: శ్రావణ మాసం అయినందున చాలా మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో ఇచ్చే కోడి గుడ్లను తినకపోవడంతో వాటిని వంట ఏజెన్సీల వారు బయటి వ్యాపారులకు విక్రయించుకుంటున్నారని పీడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రావణ మాసాన్ని అదనుగా తీసుకొని ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు ఇమ్రాన్, చరణ్, రఘు, అరవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మంత్రాలయం రూరల్ : పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి గణేష్ సూచించారు. మండలకేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పచ్చదోమ పత్తిపంటను ఆశిస్తే ఆకు ఎండిపోయి ముడత పడుతుందన్నారు. పత్తి పంటను ఆశించే పచ్చదోమతో పాటు పేనుబంక, తెల్లదోమ, తామర పురుగులను అరికట్టేందుకు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలరెడ్డి, ఎంపీఈఓ కవిత ఉన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

నందవరం : రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే పెండింగ్‌లో ఉన్న రైతులు ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలో 13,113 మంది రైతులు గానూ 12,898 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని, 208 మంది మాత్రమే పెండింగ్ ఉన్నారని వివరించారు. 208 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ శ్రీనివాసులు ఉన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి



నాగలదిన్నెలో మాట్లాడుతున్న సీఐ మధుసూదన్‌రావు

నందవరం: గ్రామప్రజలందరూ స్నేహపూర్వకంగా మెలగాలని సీఐ మధుసుదన్‌రావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో పల్లె నిద్రలో భాగంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతమైన గ్రామాల్లో గొడవలు పడకుండా అన్నదమ్ముల్లుగా జీవించాలన్నారు. పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలన్నారు.

బాబు హామీలన్నీ బూటకమే



బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: చంద్రాబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ బుటకమే అని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ప్రజలకు వివరించారు. బుధవారం కోసిగి మండలంలోని కొల్మాన్‌పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ జయరామ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగి బాబు ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ అధికారం కోసం ఎన్నికలు ముందు ప్రజలు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్య పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఇంత వరకు ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలు చేశారో గుర్తించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ నాయకులు షంషుద్దీన్, గానిగ వీరస్వామి, కాంట్రాక్టర్ నాగరాజు, బుళ్లి నరసింహులు, ప్రతాప్, కొరివి నాగరాజు, అంజి, సుల్తాన్, గుడిసె గోపాల కృష్ణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీయండి



ప్రభుత్వ మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఓట్ల కోసం మభ్యపెట్టి మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని, కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వార్డు కౌన్సిలర్లు రామాంజినమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు రుద్రాక్షాల బజారి, శ్రీనివాసరెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 24, 25 వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక మోసం చేసిన తీరును క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు బజారిరెడ్డి, కార్యదర్శి గద్దం అంజి, మైనారిటీ కార్యదర్శి అల్తాఫ్, గురవయ్య మాబాషా, నాయకులు కప్పట్రాళ్ల సలీమ్, జేరుబండి రఘువీర, మంజునాథ్, సోమేష్, చంద్రశేఖర్, ఫయాజ్, మాచాని రఘు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై స్తంభాలు వేయడం సరికాదు



రోడ్డు స్థలాల్లో స్తంభాలు పాతేశారని కొలతలను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఏఈ విజయ్‌సురేష్

నందవరం : ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్ అండ్‌బీ పరిధిలోని రోడ్డు వెంట స్తంభాలు వేయడం సరికాదని ఆర్అండ్‌బీ ఏఈ విజయ్‌సురేష్ విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని నందవరంలో ముగతి నుంచి నందవరం మీదుగా ఏర్పాటు చేసిన రోడ్డులో విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ అనుమతులు తీసుకోకుండా స్తంభాలు వేయడంతో ఏఈ పనులను నిలిపి వేశారు. రోడ్డులో వేసిన స్తంభాలను కొలిచి విద్యుత్ సిబ్బందికి, కాంట్రాక్టర్ సిబ్బందికి చూపించారు. దాదాపు 7 స్తంభాలు రోడ్డుపై వేశారని, వాటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం నందవరానికి వచ్చిన సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు రోడ్డులో విద్యుత్ స్తంభాలు పాతారాని, వాటిని తొలగించాలని రాతపూర్వంగా వినతిపత్రం అందజేశారు. ఏఈ మాట్లాడుతూ.. ముగతి నుంచి నాగలదిన్నెకు వయా నందవరం మీదుగా 19 కిలో మీటర్లకు డబుల్ లైన్‌కు ప్రతిపాదనలు పంపామని, త్వరలో మంజూరవుతుందని వివరించారు. అలాంటి సమయంలో రోడ్డుపై విద్యుత్ స్తంభాలు వేయడంతో సమస్యలు ఏర్పాడతాయన్నారు. ప్రధాన రోడ్డుకి మధ్య నుంచి 7 మీటర్లు వదలి వేసుకోవాలని సూచించారు. ఆర్ అండ్ బీ సూపర్‌వైజర్ ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు.